అస్తవ్యస్తం.. చెత్త నిర్వహణ

- రాయదుర్గంలో అధ్వానంగా వీధులు
- తడిచెత్త, పొడిచెత్త కలిపి సేకరిస్తున్న సిబ్బంది
- వ్యర్థాల తరలింపు వాహనాలతో అవస్థలు
- పారిశుధ్యం మెరుగు పేరిట రూ. లక్షలు వృథా


చెత్తను ట్రాక్టర్‌లో నింపుతున్న పారిశుధ్య కార్మికులు

రాయదుర్గం: రాయదుర్గంలో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పారిశుధ్యం మెరుగునకు రూ.లక్షలు వెచ్చిస్తున్నా నిర్వహణ తీరు అధ్వానంగా మారింది. తడి, పొడి సేకరణ తీరు అధ్వాన్నంగా కనిపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రత్యేకంగా ఈ ఆటోలను అందుబాటులోకి తెచ్చి ఈ - విధానాన్ని పటిష్టంగా అమలు చేశారు. ప్రస్తుతం చెత్త ఆటోలను మూలకు చేర్చారు. ప్రతి ఇంటా మూడు డస్ట్ బిన్లు ఇచ్చి, తడి,పొడి, ప్రమాదకర చెత్తను విడివిడిగా సేకరించారు. కూటమి సర్కారు ఏర్పాటైన తర్వాత ఈ విధానాన్ని విస్మరించారు. పట్టణంలోని 32 వార్డులు 18 వార్డు సచివాలయాలు 75 వేల మంది జనాభా ఉంది. పురపాలిక పరిధిలో రోజూ 27 టన్నుల చెత్త, వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు ఇంటింటా, వార్డుల్లో నిల్వచేసిన డస్ట్‌బిన్ల ద్వారా సేకరిస్తున్నారు. నిత్యం పట్టణంలోని శాంతినగర్ శివారులో ఉండే డంపింగ్ యార్డుకు తరలిస్తారు. దీని కోసం ట్రాక్టర్లు, ఆటోలు వినియోగిస్తున్నారు.

చెత్త తరలించే వాహనాలతో అవస్థలు..

చెత్త ట్రాక్టర్లు రోడ్డు పైకి వచ్చాయంటే చాలు ముక్కున వేలు వేసుకోవాల్సి దుస్థితి. చెత్త తరలించే వాహనాలపై టార్పాలిన్లు కప్పి తాడుతో బిగించాలి. ఓ వైపు వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసన, మరో వైపు వాహనాల్లో నుంచి చెత్త ఎగిరి కిందపడటం లాంటి కారణాలతో వాహన చోదకుల కళ్లల్లోకి దుమ్ము, దూళి చేరుతుంది. సమస్య చిన్నదే అయినా ఒక్కో సారి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఘన వ్యర్థాల నిర్వహణలో ఇష్టారాజ్యం కనిపిస్తోంది.

ఈ– విధానం అమలు ఏదీ?

ఈ విధానాన్ని తప్పక అనుసరించాలని ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు చెపుతున్నాయి. అయితే పట్టణంలో తరలించే చెత్త వాహనాలు దీనికి విరుద్ధంగా తరలివెళ్తున్నాయి. టార్పాలిన్లు కప్పి తరలించే వాహనం ఎక్కడా కనిపించలేదు. దీంతో వాహనాల నుంచి ప్లాస్టిక్ కాగితాలు, ప్లాస్టిక్ సంచులు, పేపర్లు, ఇతర పొడి చెత్త గాలికి ఎగిరి రోడ్లపై పడుతోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ– ఆటోలను అందుబాటులోకి తెచ్చి ఈ విధానాన్ని పటిష్టంగా అమలు చేశారు. ప్రతి ఇంటా మూడు డస్ట్‌బిన్లు ఇచ్చి తడి, పొడి, ప్రమాదకర చెత్తను విడివిడిగా సేకరించారు. అయితే కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత ఈ విధానం కనిపించలేదు. ప్రస్తుతం వివిధ కారణాలతో ఈ ఆటోలను మూలకు చేర్చారు.

రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో చెత్త నిర్వహణ ఇలా..

పట్టణ జనాభా	- 75 వేలు
మొత్తం వార్డులు	- 32
వార్డు సచివాలయాలు	- 18
రోజు చెత్త ఉత్పత్తి (టన్నుల్లో)	- 27
తడిచెత్త	- 16 టన్నులు
పొడిచెత్త	- 11 టన్నులు

ఇబ్బందుల్లేకుండా చెత్త తరలింపు



చెత్త తరలింపులో ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతాం. వాహనాల్లో నింపిన చెత్త గాలికి ఎగరకుండా టార్పాలిన్లు కట్టి తరలిచేలా కృషి చేస్తాం. ఇళ్ల వద్ద, ఆరు బయట చెత్త సేకరించే కార్మికులు, ఆటోలకు ఇకపై తడి, పొడి, ప్రమాదకర చెత్త వేరుగా తీసుకునేలా ఆదేశాలిచ్చాం. పట్టణంలో పారిశుధ్య మెరుగునకు కృషి చేస్తాం. – దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

క్లుప్తంగా

ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలి


ఆర్టీసీ డిపోను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ఉరవకొండ: ఉరవకొండ ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తెలిపారు. గురువారం ఉరవకొండ ఆర్టీసీ డిపోను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలో ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపో ఆవరణలోని మరుగుదొడ్లను పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రయాణికులకు తాగునీటి వసతి కల్పించాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రయాణికులకు సరిపడా కుర్చీలు ఉంచాలన్నారు. ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్‌ఐ రామకృష్ణ, ఆర్టీసీ ఎస్టీఐ రమణమ్మ పాల్గొన్నారు.

ఆడ పిల్లలను చదివించాలి


ప్రసంగిస్తున్న హెచ్‌ఎం అన్నపూర్ణ

కణేకల్లు: మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణ తెలిపారు. గురువారం స్థానిక సంజయ్‌నగర్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పిల్లల పెంపకం, చదువు విషయంలో ఆడ, మగ అన్న తేడా చూపరాదన్నారు. జీవితంలో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆడపిల్లలకు లక్ష్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఓ హనుమంతు, సీబీటీ దయానిధి, ఆర్డీటీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి


ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ వైద్యులను ఆర్డీఓ వసంతబాబు ఆదేశించారు. గురువారం కళ్యాణదుర్గం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం పాత భవనాన్ని పరిశీలించారు. భవనం లోపలి భాగం పెచ్చులూడటం, విద్యుత్ సరఫరా, మార్చురీ, కాంపౌండ్ వాల్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం సీహెచ్‌సీలో చేపట్టాల్సిన మౌలిక వసతులు, ముందుల కొరత తదితర విషయాలపై డాక్టర్లు ప్రసన్నభారతి, డాక్టర్ సాయిచరణ్, డాక్టర్ శివకుమార్‌లతో అడిగి తెలుసుకున్నారు.

రేషన్ దుకాణాల ఏర్పాటుపై పరిశీలన

బ్రహ్మసముద్రం : వేపులపర్తి, భైరసముద్రం పరిధిలోని గోవిందయ్యదొడ్డి, అజ్జయ్యదొడ్డి గ్రామాల కార్డుదారుల కోసం రేషన్ దుకాణాలఏర్పాటుపై ఆర్డీఓ వసంతబాబు పరిశీలించారు. గురువారం గురువారం అజయ్యదొడ్డి, గోవిందయ్యదొడ్డి గ్రామాలను పరిశీలించారు. గ్రామంలోని ప్రజలతో ఆయన నేరుగా మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం కోసం కిలో మీటర్లు మేర వెళ్లాల్సి వస్తోందని వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్‌ఐ నాగిరెడ్డి, వీఆ ర్వోలు నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

రాయదుర్గం: ప్రైవేట్ దుకాణాల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. గురువారం నియోజకవర్గంలోని డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం చెక్‌పోస్టును అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సీఐ మహేష్‌కుమార్‌తో కలసి తనిఖీ చేశారు. డి హీరేహాళ్, పట్టణంలోని మహాలక్ష్మి వైన్స్ షాపుల్లో రికార్డులు పరిశీలించారు. అనంతరం స్థానిక పీఎస్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కర్ణాటక మద్యం ఏపీలోకి దిగుమతి కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపాలన్నారు. నాటుసారాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఎస్‌ఐ పవన్‌కుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు పురుషోత్తం, హరియన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం


గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం జరుపుతున్న దృశ్యం


పార్వతిపర మేశ్వరుల కల్యాణోత్సవం జరుగుతున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలో గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం, నూతన రథోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉదయం స్థానిక బళ్లారి రోడ్డులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహారుద్రాభిషేకం, శాస్త్రోక్తంగా గిరిజా కల్యాణోత్సవ హోమం నిర్వహించారు. అనంతరం గిరిజా నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం జరిగింది. సాయంత్రం గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి రథోత్సవం సాగింది.

శాస్త్రోక్తంగా సంగమేశ్వరుడి కల్యాణం

కూడేరు: ప్రఖ్యాతిగాంచిన కూడేరు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. తొలుత ఉత్సవ విగ్రహాలను గ్రామం నుంచి పల్లకీలో ఉంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

శెట్టూరు: శెట్టూరు చంద్రమౌళీశ్వరస్వామి, కనుకూరు రామలింగేశ్వరస్వామి, లక్ష్మంపల్లి, యాటకల్లు, ములకలేడు, చెర్లోపల్లి గ్రామాల్లో శివాలయాల్లో గురువారం పూజలు నిర్వహించారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో గురువారం తెల్లవారు జామున పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్థానిక నగరేశ్వరస్వామి ఆలయం నుంచి ట్రాక్టర్‌లో స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను ఉంచి ఊరేగించారు.

వైభవంగా వీరభద్రస్వామి ఉచ్చాయం వేడుకలు

వజ్రకరూరు: తట్రకల్లు గ్రామంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఉచ్చాయం లాగే వేడుకలు గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వీరభద్రస్వామి ఉచ్చాయం లాగే కార్యక్రమం నిర్వహించారు. తట్రకల్లులో శుక్రవారం సాయంత్రం భద్రకాళిసమేత వీరభద్ర స్వామి రథోత్సవం జరగనుంది.

పశుబీమాపై అవగాహన కల్పించాలి


గూళ్యపాల్యం ఆర్‌ఎస్‌కేలో రికార్డులను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ వెంకటేశ్

ఉరవకొండ: వజ్రకరూరు మండలం గూళ్యపాల్యం గ్రామ ఆర్‌ఎస్‌కే కేంద్రాన్ని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం డీడీ మాట్లాడుతూ పశుబీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు.

నూతన కమిటీలతో వైఎస్సార్‌సీపీలో జోష్



ఉరవకొండ:నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి పనిచేసిన వారికి వైఎస్సార్‌సీపీ నాయకత్వం కీలక పదవులు కట్టబెట్టి, వారిలో నూతనోత్తేజం నింపింది. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ సమన్వ య కర్త వై.విశ్వేశ్వరరెడ్డి సూచనల మేరకు పట్టణ, రూరల్ మం డల కమిటీలు, విడపనకల్లు కమిటీలను ఎంపిక చేసింది.

ఉరవకొండ పట్టణ కమిటీ ఇదే.. : ఉరవకొండ అధ్యక్షుడిగా ఈడిగ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పచ్చి రవి, పాతపేట వేమన్న, ప్రధాన కార్యద ర్శులుగా అంగదాల ఆంజి, కరూర్ వెంకటేష్, వశికేరి మల్లికార్జున, టైలర్ శర్మాస్, కార్యదర్శులుగా శ్రీనివాసులు, ఎరుకుల శేఖర్, రేణుకమ్మ, జోగిభీమ, రాము, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నాగరాజు, కొత్తపల్లి చంద్రశేఖర్, బీరే శివ, పద్మాశాలి సోమశేఖర్, కమ్మటి రామాంజనేయులు, మాలరాము, జయరామ్‌ను ఎంపిక చేశారు.

ఉరవకొండ మండల రూరల్ కమిటీ: రూరల్ కమిటీ అధ్యక్షులు రాయంపల్లి ఎర్రిస్వామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నింబగల్లు చిదంబరం, రమేష్, ప్రధాన కార్యదర్శులుగా ఈశ్వర్, శ్రీనివాసులు, ప్రసాద్, రామకృష్ణ, ఓబయ్య, కార్యదర్శులుగా రమేష్, జయరావ్, లాలుస్వామి, వెంకటేష్, నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సుంకే నాయక్, పెన్నయ్య, ప్రసాద్, చలమారెడ్డి, బాషాప్ప, మారుతి, చిన్న ఎర్రిస్వామిని ఎంపిక చేశారు.

విడపనకల్లు మండల కమిటీ ఇదే : విడపనకల్లు అధ్యక్షుడిగా డోనేకల్లు కురుబ రమేష్, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర, రామాంజనేయులురెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా మస్తాన్, నాగిరెడ్డి, హనమంతు, ఓబుళప్ప, కార్యదర్శిలుగా లక్ష్మన్న, నాగరాజు, రాజశేఖర్, అశోక్ రెడ్డి, శ్రీనివాసులు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నీలకంఠారెడ్డి, లేపాక్షి, అయ్యప్పరెడ్డి, రఫత్ హుసేన్, ఓబుళప్ప, రమణ, మడకశిర, గిరిధర్, మస్తాన్‌ను ఎంపిక చేశారు.


ఉచితంగా పంపిణీ చేసిన చికెన్ కబాబ్, బాయిల్డ్ ఎగ్ కోసం ఎగబడుతున్న జనం

ఎగ్‌బడిన జనం

రాయదుర్గంటౌన్: రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ ఉంది.. పలు ప్రాంతాల్లో కోడి మాంసం, గుడ్లు తినకూడదని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తోడు చెకెన్, కోడి గుడ్ల ధరలు అమాంతం తగ్గిపోయాయి. కానీ ఉచితంగా రాయదుర్గంలోని చికెన్ మార్కెట్ వద్ద గురువారం సాయంత్రం పౌల్ట్రీ బ్రీడర్స్ కోఆర్డినేషన్ అసోసియేషన్, వెంకోబ్ చికెన్, నేషనల్ ఎగ్‌కో ఆర్డినేషన్ కమిటీ మేనేజర్ శ్రీధరన్ బ్రీడర్స్ రవికుమార్, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక చికెన్ షాపు అసోసియేషన్ వారి సహకారంతో ఉచిత చికెన్ కబాబ్, బాయిల్డ్ ఎగ్ మేళా నిర్వహించారు. బర్డ్ ఫ్లూ రూమర్స్‌తో చికెన్ వినియోగం తగ్గడంతో ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఉచిత మేళా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. దాదాపు 200 కేజీల చికెన్ కబాబ్, 2000 గుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. చికెన్ తింటే ఎలాంటి రోగాలు రావని, అపాయం లేదని ప్రతి ఒక్కరూ తినొచ్చని వెంకోబ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ శ్రీధరన్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రక్షణ కల్పించండి


మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

కూడేరు: మండలంలోని కడదరకుంటలో దాడికి గురైన దళితులకు రక్షణ కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలు కేపీ నారాయణ స్వామి, హనుమంతు, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లన్న, ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్ వినూత్నకు వినతిపత్రం అందించారు. విచారణ చేయించి సర్వే నంబర్ 27లోని 10.99 ఎకరాల భూమిని దళితులకు దక్కేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు రామాంజనేయులు, బాధితులు కిష్టప్ప, వెంకటేశులు, రామచంద్ర, ఆదిలక్ష్మీ, రమేష్, పెద్దన్న పాల్గొన్నారు.

ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలి

గుమ్మఘట్ట: నూతన గృహాలను నిర్మించుకుంటున్న పేదలు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇటీవల జీవో 30 విడుదల చేసిందన్నారు. 2019కు ముందు ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు.

ఫ్రూట్స్ కవర్లను సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లో మామిడి రైతులు ఉద్యాన శాఖ అందించే ఫ్రూట్స్ కవర్లను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి కృష్ణతేజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక హెక్టార్ వరకు రాయితీ కవర్లు అందించనున్నట్లు తెలిపారు. ఒక కవర్ ధర రూ.2 అని, మామిడి, చినీ, దానిమ్మ, ద్రాక్ష సాగు చేసిన ఉద్యాన రైతులు ట్రాక్టర్ సొంతంగా కలిగి ఉండి అదే రైతు పేరుపైన ఆర్‌సీ ఉన్నవారికి ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు 50 శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు కళ్యాణదుర్గంలోని ఉద్యాన కార్యాలయం, గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పీటీఆర్ పల్లి దిగువతండాలో గోవింద్‌నాయక్ నాటు సారా విక్రయిస్తుండగా గురువారం పట్టుకున్నారు. అతని నుంచి ఐదు లీటర్ల నాటుసారా, ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ హసీనాబాను, సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా రాతిదూలం లాగుడు పోటీలు

కూడేరు: మరుట్ల–3వ కాలనీలో గురువారం చితంబరేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు పోటా పోటీగా జరిగాయి. బళ్లారి జిల్లా ఆంధ్రాల గ్రామానికి చెందిన ఆనంద్ వృషభాలు, కర్నూలు జిల్లా గుడికల్ గ్రామానికి చెందిన నల్లయ్య వృషభాలు 6900 అడుగుల దూరం సమానంగా లాగాయి. ప్రథమ , ద్వితీయ బహుమతులు రూ.70వేలు సమానంగా పంపిణీ చేశారు. మద్దెల చెరువుకు చెందిన చిన్నకొండయ్య వృషభాలు తృతీయ, కర్నూల్ జిల్లా గుడికల్‌కు చెందిన చాకలి దస్తగిరి వృషభాలు నాల్గో బహుమతి సాధించాయి.

చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు తిప్పేస్వామి, నరసింహులు, నాగయ్య పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు నందు, ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, వెంకీ, వంశీ, ధనంజయ, అవినాష్‌లు పాల్గొన్నారు.

నేత్రపర్వం..ఊరూరా రథోత్సవం


అలంకరణలో సిద్ధేశ్వరస్వామి మూలవిరాట్


పెద్ద ముష్టూరులో సిద్ధేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ఆమిద్యాలలో భీమలింగేశ్వరస్వామి రథోత్సవం

వైభవంగా సిద్ధేశ్వరస్వామి రథోత్సవం

ఉరవకొండ: పెద్దముష్టూరులోని సిద్ధేశ్వరస్వామి ఆలయ రథోత్సవం గురువారం వైభవంగా జరిగాయి. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది.

వైభవంగా భీమలింగేశ్వరస్వామి రథోత్సవం

ఉరవకొండ: ఆమిద్యాల గ్రామంలో భీమలింగేశ్వరస్వామి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకం, మహామంగళహారతి, కుంకుమార్చన చేశారు. అనంతరం గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా రథాన్ని ముందుకు లాగారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలో గురువారం జరిగిన గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి రథోత్సవం , కల్యాణోత్సవానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు పొరాళ్ల శివకుమార్, కౌన్సిలర్లు హాజరయ్యారు.

కనుల పండువగా చితంబరేశ్వర రథోత్సవం

కూడేరు: మండలంలోని మరుట్ల–3వ కాలనీలో గురువారం చితంబరేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. తొలత చితంబరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఆలయ ప్రాంగణంలో లాగారు.

నేత్రపర్వంగా మల్లేశ్వరస్వామి రథోత్సవం

కుందుర్పి: రుద్రంపల్లిలో గురువారం సాయంత్రం మల్లేశ్వరస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున స్వామికి అభిషేకం, మధ్యాహ్నం పూల రథోత్సవం, సాయంత్రం స్వామి మూలవిరాట్ ను రథంలో అధిష్టించి గ్రామంలో వీధుల్లో ఊరేగించారు.

ఘనంగా జంబణ్ణ తాత రథోత్సవం

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): మండలంలోని పులకుర్తిలో వెలసిన సద్గురు జంబణ్ణ తాత రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా ఎత్తున రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.


మరుట్ల-3 కాలనీలోని చితంబరేశ్వర స్వామి


రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైభవంగా జరుట్లరామ లింగేశ్వరస్వామి రథోత్సవం

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురంలో జరుట్ల రామలింగేశ్వరస్వామి రథోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. గురువారం ఉదయం స్వామికి అభిషేకం, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. మధ్యాహ్నం మడుగు తేరు కనుల పండువగా జరిగింది. జరుట్ల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య గురువారం తెలిపారు.


జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి అమ్మవారు


ఆమిద్యాలలో అలంకరణలో శివపార్వతులు


జరుట్లరామలింగేశ్వరస్వామి మూల విరాట్


జరుట్లరాంపురంలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


పులకుర్తిలో జంబణ్ణతాత రథాన్ని లాగుతున్న భక్తులు


రుద్రంపల్లి గ్రామంలో ఊరేగుతున్న మల్లేశ్వరస్వామి


జరుట్ల రాంపురంలో రథోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు